క్లుప్తంగా

విద్యుత్ సమస్యల పరిష్కారానికి సదస్సు

అల్వాల్: విద్యుత్ సమస్యల పరిష్కారానికి గురువారం వినియోగదారుల సమావేశం నిర్వహించనున్నట్లు లోతుకుంట విద్యుత్ సబ్ స్టేషన్ ఏడీఈ సీహెచ్ శ్రీరామచారి తెలిపారు. లోతుకుంట విద్యుత్ సబ్ స్టేషన్‌తో (ఆర్‌పీనిలయం) పాటు లాల్‌బజార్‌లోని విద్యుత్ కార్యాలయం వద్ద వినియోగదారుల సదస్సు అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ సదస్సు ఉంటుందన్నారు. వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను సదస్సులో పరిష్కరించుకోవచ్చన్నారు.

నేడు ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని బషీర్‌బాగ్ పీజీ లా కాలేజీలో 5 సం.ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం కోర్సుల్లో ప్రవేశాలకు నేడు (18న) కళాశాల ఆవరణలో స్పాట్ అడ్మిషన్లు జరగనున్నాయి. బుధవారం ఎల్‌ఎల్‌బీ కోర్సుకు ఉదయం 10.30 లకు, ఎల్‌ఎల్‌ఎం కోర్సుకు సాయంత్రం 5 గంటలకు హాజరు కావాలని అధికారులు తెలిపారు.

ఖమ్మంలో యూనివర్సిటీని ఏర్పాటు చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఖమ్మం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని ఆ జిల్లాకు చెందిన ఓయూ విద్యార్థులు, పీడీఎస్‌యూ నేతలు మంగళవారం ఎస్.నాగేశ్వర్‌రావు, ఎస్.సుమంత్ కోరారు. నేడు (18న) సీఎం కేసీఆర్ ఖమ్మంలో బీఆర్‌ఎస్ సభ సందర్భంగా ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఉన్నత విద్య వ్యాప్తిలో ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన అన్యాయం తెలంగాణలోను జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి సభలో సీఎం కేసీఆర్ ఈ అంశంపై స్పందించాలని డిమాండ్ చేశారు.

ఓయూ పాలన పదవుల్లో ప్రొ.అన్సారీపై వివక్ష తగదు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పాలన పదవుల్లో ప్రొ.అన్సారీపై వివక్ష తగదని బీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వేల్పుల సంజయ్ పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన అన్సారీని పాలన పదవులకు దూరంగా ఉంచి అనుభవం లేని అసిస్టెంట్ ప్రొఫెసర్లు, జూనియర్లను ఉన్నత పదవుల్లో నియమించడం అన్యాయమన్నారు. గతంలో జరిగిన చిన్న చిన్న సంఘటలను దృష్టిలో ఉంచుకొని పాలన పదవులను ఇవ్వకుండా అవమానపర్చడం దారుణమన్నారు. ఓయూలో ముస్లిం మైనార్టీలకు ముఖ్యమైన పదవుల్లో నియమించకపోవడం విచారకరమన్నారు. విజ్ఞానాన్ని అందించే వర్సిటీల్లో అధ్యాపకుల నడుమ పగలు, ప్రతీకారాలు, కక్షలకు తావు ఉండకూడదన్నారు. ప్రస్తుతం ఓయూలో ఉన్న అధ్యాపకుల్లో ప్రొ.అన్సారీ సీనియర్ కావడంతో ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్‌గా అవకాశం కల్పించాలని వీసీ ప్రొ.రవీందర్‌ను కోరారు.

అదనపు స్లాట్‌లను వినియోగించుకోండి

రాంగోపాల్‌పేట్: తత్కాల్, సాధారణ పాస్‌పోర్టుల కోసం దరఖాస్తులు చేసుకున్న వారు ఇటీవల అదనంగా విడుదల చేసిన అపాయింట్మెంట్‌లను వినియోగించుకోవాలని అధికారి దాసరి బాలయ్య సూచించారు. దరఖాస్తుదారులు అపాయింట్మెంట్‌ల కోసం చాలా కాలం నిరీక్షిస్తుండటంతో తాము హైదరాబాద్‌లోని ప్రాంతీయ పాస్‌పోర్టు సేవా కేంద్రాల్లో ఈ నెల 16వ తేదీ నుంచి అపాయింట్మెంట్‌ల సంఖ్యను పెంచినట్లు తెలిపారు. పెంచిన అపాయింట్మెంట్ల కోసం ప్రతి రోజు సాయంత్రం 4.30 గంటల తర్వాత పాస్‌పోర్టు వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చన్నారు. డిసెంబర్‌లో 4 ప్రత్యేక డ్రైవ్ ద్వారా శనివారం కూడా దరఖాస్తులు స్వీకరించామని ఇందులో కొంత మంది గతంలో దరఖాస్తులు చేసుకున్న వారు రీ షెడ్యూల్ చేసుకున్నారని అలాంటి వారి తేదీల్లో ఉన్న ఖాళీల అపాయింట్మెంట్‌లను ఇప్పుడు ఇస్తామన్నారు.

అత్యాచారయత్నం కేసులో సిపాయికి ఐదేళ్ల జైలు

కంటోన్మెంట్: బాలికపై అత్యాచారానికి యత్నించిన కేసులో ఆర్మీ సిపాయికి ఐదేళ్ల జైలు శిక్ష పడింది. తిరుమలగిరి పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రం బాగల్పూర్ జిల్లాకు చెందిన బ్రిజేశ్ కుమార్ (32) సిపాయిగా పని చేస్తూ అమ్ముగూడలోని ఆర్మీ క్వార్టర్స్‌లో ఉంటున్నాడు. 2018 జూలై 17న బాధిత బాలిక ఆమె బాయ్‌ఫ్రెండ్ అమ్ముగూడ రైల్వే గేట్ వద్ద కొండ సమీపంలోని చెట్టు కింద కూర్చొని మాట్లాడుకుంటున్నారు. ఆ సమయంలో అక్కడకు వచ్చిన బ్రిజేశ్ యాదవ్ ఆ యువకుడిపై దాడి చేయడంతో అతని పళ్లు విరిగిపోయాయి. బాలికను బలవంతంగా పొదల్లోకి లాక్కెళ్లి అత్యాచార యత్నం చేశాడు. బాధితురాలు 100కు డయల్ చేయడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కానిస్టేబుల్‌ను చూసిన బ్రిజేశ్ పటేల్ అతనిపై కూడా దాడి చేసి పారిపోయేందుకు యత్నించాడు. నిందితుడిని కానిస్టేబుల్ పట్టుకుని స్టేషన్‌కు తీసుకొచ్చాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం హాకా భవన్‌లోని పోక్సో కోర్టు నిందితుడికి ఐదేళ్ల శిక్షతో పాటు రూ.2.25 లక్షల జరిమానా విధించింది.

వంద రోజులు.. 'కంటి వెలుగు'



ఏఎస్‌రావునగర్ కమలానగర్‌లో కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీసీ శంకర్



చర్లపల్లిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కాప్రా: పేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు రెండో విడత కార్యక్రమాన్ని కాప్రా సర్కిల్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎస్.శంకర్ కోరారు. నేటి నుంచి కాప్రా సర్కిల్‌లో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జీహెచ్‌ఎంసీ, ఆరోగ్యశాఖ సంయుక్తంగా నిర్వహించే ఈ కంటి వెలుగు కేంద్రాలను మంగళవారం డీసీ శంకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలో మొత్తం 7 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

- ఈ ఏడు కేంద్రాలు కాప్రా డివిజన్ గాంధీనగర్ కమ్యూనిటీ హాల్, ఏఎస్‌రావునగర్ డివిజన్‌లోని కమలానగర్ వెల్ఫేర్ అసోసియేషన్, ఏఎస్‌రావునగర్ సీనియర్ సిటీజన్ భవన్, చర్లపల్లి డివిజన్‌లోని ఈసీ నగర్ సీనియర్ సిటిజన్ భవనం, మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్‌లో హెచ్‌బీకాలనీ వార్డు కార్యాలయం, మల్లాపూర్ డివిజన్ గొడసంఘం కమ్యూనిటీ హాల్, నాచారం డివిజన్ భవానీనగర్ కమ్యూనిటీ హాల్‌లో ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు.
- నేటి నుంచి వంద రోజుల పాటు నిర్వహించే కంటి పరీక్ష కేంద్రాల్లో వైద్యులు, మెడికల్ సిబ్బంది ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉంటారని తెలిపారు. కంటి పరీక్షలు నిర్వహించి వెంటనే అవసరమైన వారికి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. కంటి పరీక్షలు చేయించుకునే వారు తప్పని సరిగా తమ ఆధార్ కార్డు వెంట తీసుకురావాలని సూచించారు. సర్కిల్ పరిధిలో నిర్వహించే కంటి వెలుగు కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ నాగరాజు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరు డివిజన్లలో తొమ్మిది సెంటర్లు..

మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో ఈ నెల 19 నుంచి ప్రారంభమయ్యే కంటి వెలుగు కార్యక్రమానికి ఆరు డివిజన్లలో తొమ్మిది సెంటర్లను ఏర్పాటు చేశారు. నేరెడ్‌మెట్ డివిజన్(136) పరిధిలోని మల్లన్న దేవాలయం యాప్రాల్, వినాయకనగర్ డివిజన్(137) పరిధిలోని దీన్‌దయాళ్‌నగర్ కమ్యూనిటీహాల్, సైనిక్‌పురిలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్, మౌలాలి డివిజన్(138) పరిధిలోని గాయత్రినగర్ సాయిబాబా దేవాలయం, ప్రగతినగర్(యునాని ఆస్పత్రి వెనుక), ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్(139) పరిధిలోని అనంత సరస్వతీనగర్ కమ్యూనిటీహాల్‌లో, మల్కాజిగిరి డివిజన్(140) పరిధిలోని మహిళాభవన్‌లో, గౌతంనగర్ డివిజన్(141) పరిధిలోని మధుసూదన్‌నగర్ కమ్యూనిటీహాల్, మల్లికార్జుననగర్ కమ్యూనిటీహాల్‌లో కేంద్రాలను ఏర్పాటు చేశామని డీసీ రాజు తెలిపారు.

సమన్వయంతో పనిచేయాలి..

కుషాయిగూడ: కంటి వెలుగు రెండో విడత కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని అధికారులకు కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, ప్రభుదాస్ సూచించారు. చర్లపల్లి, మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్‌లో కాప్రా సర్కిల్ అధికారులతో కలిసి మంగళవారం వారు ఏర్పాట్లను పరిశీలించారు. వైద్య పరీక్షల కోసం వచ్చే వారికి కోసం కేంద్రాల వద్ద అన్ని వసతులు ఉండేలా చూడాలన్నారు. కాప్రా సర్కిల్ డీసీ శంకర్, ఏఈ స్వరూప, డాక్టర్ మౌనిక, సిబ్బంది, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలో..

బోడుప్పల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కంటి వెలుగును జయప్రదం చేయాలని బోడుప్పల్ కార్పొరేషన్ కమిషనర్ పద్మజారాణి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలో కంటి వెలుగు శిబిరాలకు ఏర్పాట్లు చేశామన్నారు. ఈ నెల 19వ తేదీన 1వ డివిజన్ చెంగిచర్ల జలమండలి కార్యాలయం భవనం, 15వ డివిజన్ బొల్లిగూడెం కమ్యూనిటీ హాలు వద్ద శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉంటుందని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అన్ని కాలనీల్లో మౌలిక వసతులు



వెంకటాపురం డివిజన్ దినకర్‌నగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

అల్వాల్: వెంకటాపురం డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. డివిజన్ పరిధిలోని దినకర్‌నగర్‌లో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న సమస్యలను కాలనీ వాసులతో కలిసి చర్చించారు. కాలనీలో డ్రైనేజీ, అంతర్గత రోడ్లు, పార్కు అభివృద్ధి తదితర సమస్యలను కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కాలనీవాసులు విజయకుమార్‌గౌడ్, అమర్నాథ్, సూర్యకిరణ్, కృష్ణారావు, స్థానిక నాయకులు అనిల్‌కిషోర్‌గౌడ్, భాస్కర్, మోసీస్, సంతోష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌కేహెచ్ కాలనీలో..

మౌలాలి: డివిజన్ పరిధిలోని ఆర్‌కేహెచ్ కాలనీలో మంగళవారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పర్యటించారు. కాలనీలో కమ్యూనిటీహాల్, రోడ్లు, పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని కాలనీవాసులు కోరారు. అనంతరం ఎమ్మెల్యే హన్మంతరావు స్పందించి కాలనీలో యూజీడీ కోసం జలమండలి ఎండీ దానకిషోర్‌తో ఫోన్‌లో మాట్లాడి నిధులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం కాలనీలో ఉన్న పార్కును ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో డీఈ మహేష్, ఏఈ మధురిమ, నాయకులు అమీనుద్దీన్, జీఎస్‌వీ.సతీష్‌కుమార్, పిట్ల శ్రీనివాస్, భాగ్యనందరావు, సత్తయ్య, భాస్కర్, చందు, సంతోష్‌నాయుడు, ఆదినారాయణ, సందీప్‌గౌడ్, సూరి, బాలకృష్ణగుప్తా, కాలనీ అధ్యక్షుడు రాజారెడ్డి, ఉపాధ్యక్షుడు భిక్షపతి, రాజేంద్రకుమార్, వీరభద్రరావు, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌కేహెచ్ కాలనీలో..

ముగిసిన సందీప్‌రెడ్డి అంత్యక్రియలు



నివాళులర్పిస్తున్న ఎంపీ వెంకట్‌రెడ్డి

మల్లాపూర్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సందీప్‌రెడ్డి భౌతికకాయాన్ని పలువురు నేతలు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం పలువురు నేతలు మాట్లాడుతూ.. సందీప్‌రెడ్డి మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని అన్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అంత్యక్రియల్లో భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి, కాంగ్రెస్ మేడ్చల్ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి, మందముల పరమేశ్వర్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, సాయిజెన్‌శేఖర్, మహేష్‌గౌడ్, చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ నేతలు బస్వరాజు శ్రీనివాస్ పాల్గొన్నారు. మల్లాపూర్ వైకుంఠ ధామంలో అంత్యక్రియలను పూర్తి చేశారు.

ఈనెలాఖరు వరకు పన్ను చెల్లించాలి

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని ఇంటి పన్నులు, వ్యాపార ట్రేడ్ లైసెన్స్ రుసుము, ఇంటి పన్ను బకాయిలను ఈ నెల 31వ తేదీలోపు నగరపాలక సంస్థ కార్యాలయంలో, ఆన్‌లైన్‌లో చెల్లించాలని నగర పాలక సంస్థ అధికారులు తెలిపారు. ఇంటి పన్నులు, ట్రేడ్ లైసెన్స్ రుసుము చెల్లించకుంటే ఇళ్లను సీజ్ చేస్తామని పేర్కొన్నారు.

ఇష్టానుసారంగా రేట్లు ఫిక్స్ చేయవద్దు

కాప్రా సర్కిల్ ఏఎంహెచ్‌ఓ డాక్టర్ స్వప్నారెడ్డి



కాప్రా: జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఇంటింటికీ చెత్త సేకరిస్తున్న ఆటో నిర్వాహకులు కొత్తకొత్త రూల్స్‌తో తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని కాప్రా సర్కిల్‌లోని పలు కాలనీల వాసులు ఆరోపిస్తున్నారు. జనవరి నెల నుంచి రుసుం పెంచామని, ఇంటింటికీ చెత్త సేకరించే కొందరు నిర్వాహకులు స్పష్టం చేయడంతో పలు కాలనీల వాసులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు స్పందించాలని ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థనలపై కాప్రా సర్కిల్ ఏఎంహెచ్‌ఓ డాక్టర్ స్వప్నారెడ్డి స్పందించారు. చెత్త సేకరణకు ఎలాంటి రుసుం జీహెచ్‌ఎంసీ నిర్ధారించలేదని, జనవరి నెల నుంచి ఇంటింటి రుసుం పెంచారనేది అవాస్తవమని స్పష్టం చేశారు. చెత్త సేకరించే ఆటోల నిర్వాహణకు గతంలో ఇంటికీ రూ.100, అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్‌కు వెళ్లి సేకరిస్తే రూ.120గా అవగాహన ఒప్పందం చేసుకున్నారని వివరించారు. ఈ రేట్లు కూడా ఆటో నిర్వాహకుల నిర్వహణ కోసం మనవతా దృక్పథంతో అవగాహన ఒప్పందం చేసుకున్నారని, అది కూడా జీహెచ్‌ఎంసీ అధికారికంగా నిర్ధారించలేదని తేల్చిచెప్పారు. రేట్లు పెంచామని ఎవరైనా డిమాండ్ చేస్తే వెంటనే తమ దృష్టికి కానీ, తమ సిబ్బంది దృష్టికి తీసుకురావాలని ఆమె సూచించారు. మన నగరం పరిశుభ్రంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, తడి, పొడి చెత్తను వేరు చేసి ఇళ్ల వద్దకు వచ్చే చెత్త సేకరణ ఆటోల్లోనే చెత్తను వేయాలని కోరారు. ఇష్టానుసారంగా ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకూడదని సూచించారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో మంగళవారం వేకువజాము నుంచి చేపట్టిన పారిశుద్ధ్య పనులు మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీయాదవ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చెత్తను రోడ్డుపై వేయకుండా చెత్త డబ్బాలు ఏర్పాటు చేసుకుని ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ వాహనంలోనే వేయాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి జూట్ బ్యాగుల వాడకం పెంచాలన్నారు. కార్యక్రమంలో జంగయ్యయాదవ్, మాజీ వార్డు సభ్యుడు రహీం, విజయ్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



బోడుప్పల్: బోడుప్పల్ హేమనగర్ కాలనీకి చెందిన రాజేశ్వరీ భర్త రవికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును కార్పొరేటర్ కొత్త శ్రీద్యా చక్రపాణి గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ చక్రపాణిగౌడ్ మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు గడసు జగదీశ్వర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, సంతోష్‌రెడ్డి, గోపి గోవింద్ రాజ్, ధర్మవతి తదితరులు ఉన్నారు.



అభినందనలు



విజేతలను అభినందిస్తున్న డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్

అల్వాల్: నగరంలోని చింతల్‌లో ఈ నెల 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు జరిగిన 3వ తానీషా(టీఏఎఫ్‌ఐఎస్‌ఏ) ఓపెన్ నేషనల్ బాక్సింగ్ పోటీల్లో అల్వాల్‌కు చెందిన కోమ్‌క్లబ్ ఆఫ్ బాక్సింగ్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. టి.చైత్ర సింగ్, ఎం.తేజస్, కే.సాయి సూర్యదత్తా మెడల్స్‌ను సాధించారు. మెడల్ సాధించిన విద్యార్థులకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ మంగళవారం అభినందనలు తెలిపారు. సునీత తదితరులు ఉన్నారు.

నియామకం

ఉప్పల్: ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలిగా అమరేశ్వరిని ఎన్నుకున్నారు. ఏ బ్లాక్ అధ్యక్షుడు మందముల పరమేశ్వర్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు గోగుల సరిత సమక్షంలో ఈ నియామకం జరిగింది. చిలుకానగర్ డివిజన్ అధ్యక్షురాలిగా తడి సుశీల, రామంతాపూర్ డివిజన్ అధ్యక్షురాలు ఆకుల సంధ్యా, నాచారం డివిజన్ అధ్యక్షురాలిగా టి.ఉమను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. అనంతరం పరమేశ్వర్‌రెడ్డి, గోగుల సరిత మాట్లాడుతూ నియోజకవర్గంలో మహిళా కాంగ్రెస్‌కు కొత్త శక్తి వచ్చిందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో కొంపల్లి బాలరాజు, బాకారం లక్ష్మణ్, రఫిక్, తవిడ బోయిన గిరిబాబు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ నూతన కమిటీతో పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

ఐలా చైర్మన్ మహిపాల్‌రెడ్డికి సత్కారం

మల్లాపూర్: టీఎస్ఐఐసీ నాచారం సర్వీస్ సొసైటీ ఎన్నికల్లో చైర్మన్‌గా గెలుపొందిన మహిపాల్ రెడ్డిని మంగళవారం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేల నర్సింగ్‌రావు శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. అనంతరం అంబేడ్కర్ చిత్రపటాన్ని మహిపాల్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్‌రావు, మోహన్‌రావు, సుందర్‌రామయ్య, మల్లేష్ తదితరులు ఉన్నారు.



మహిపాల్‌రెడ్డిని సత్కరిస్తున్న ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, నర్సింగ్‌రావు

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వం త్వరలో చేపట్టనున్న ఉద్యోగ నియామకాల్లో భాగంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గ్రూప్–2, 3, 4 పరీక్షలు రాసే అర్హులైన ఎస్సీ నిరుద్యోగ అభ్యర్థులకు మూడు నెలల ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్సీ అభివృద్ధి శాఖ జిల్లా అధికారి జి.వినోద్‌కుమార్ తెలిపారు. డిగ్రీ, పీజీ కోర్సులు పూర్తి చేసిన ఎస్సీ అభ్యర్థులు మాత్రమే ఉచిత శిక్షణకు అర్హులని, ఉచిత శిక్షణతో పాటు అవసరమైన అధ్యయన సామగ్రి, భోజన ఖర్చులు ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అర్హులైన ఎస్సీ నిరుద్యోగ అభ్యర్థులు ఆన్‌లైన్‌లో 31వ తేదీ వరకు సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సందడిగా 'బంధు మిలన్'

కంటోన్మెంట్: సంక్రాంతిని పురస్కరించుకుని మంగళవారం నిర్వహించిన ఒడియా వాసుల 'బంధు మిలన్ సందడిగా సాగింది. తిరుమలగిరిలోని మహాలక్ష్మి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి 1ఈఎంఈ సెంటర్ కమాండెంట్, బ్రిగేడియర్ సురేశ్ అతిథిగా హాజరయ్యారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న ఒడియా పీపుల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఓపీడబ్ల్యూఏ) వ్యవస్థాపక అధ్యక్షులు రష్మి రంజన్ మహాపాత్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి నగరవ్యాప్తంగా ఉన్న ఒడియా వాసులు సుమారు 500 మందికి పైగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వివిధ రంగాల్లో రాణించిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం ఓపీడబ్ల్యూఏ కేలండర్‌ను ఆవిష్కరించారు.

డ్రైనేజీ సమస్యకు పరిష్కారం

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ రైల్‌విహార్ కాలనీ మెయిన్ రోడ్డులో భారీ వాహనాల రాకపోకలతో డ్రైనేజీ పైప్‌లైన్ ధ్వంసమై మురుగు రోడ్డుపై పారుతుండటంతో సమస్యను స్థానికులు కార్పొరేటర్ బొంతు శ్రీదేవి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కార్పొరేటర్ సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించి సమస్యకు పరిష్కారం చూపారు. దీంతో స్థానికులు కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



ముగిసిన సంబురాలు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో నాలుగు రోజుల నుంచి నిర్వహించిన సంక్రాంతి సంబురాలు మంగళవారం ముగిశాయి. గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కథలు, బుడబుక్కల జంగమ దేవరుల పాటల అలరించాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



హత్యాయత్నం కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు



నిందితుడు కృష్ణ(ఫైల్)

మల్లాపూర్: హత్యాయత్నం కేసులో నిందితుడికి మల్కాజిగిరి ఏఎస్‌జే కోర్టు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.4వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. వివరాలు.. నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లాపూర్ అన్నపూర్ణ కాలనీలోని మా రెసిడెన్సీలో 2017లో పార్కింగ్ విషయంలో జె.సాయిరామ్, వంశీ, వాచ్‌మెన్ నాగరాజుతో కృష్ణ(43) వాగ్వాదానికి దిగాడు. దీంతో అపార్ట్‌మెంట్‌లో ఉన్న ఆంజనేయులు సయోధ్య కుదురుస్తుండగా కృష్ణ కారులో నుంచి కత్తితీసి జె.సాయిరామ్, వంశీ, ఆంజనేయులు, వాచ్‌మెన్ నాగరాజుపై దాడి చేశాడు. దీంతో నాచారం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఆధారాలు సేకరించి నిందితుడు కృష్ణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడు కృష్ణకు జైలు శిక్షతో పాటు, జరిమానా విధిస్తూ మల్కాజ్‌గిరి కోర్టు న్యాయమూర్తి శ్రీదేవీ మంగళవారం తీర్పు వెల్లడించారు. నిందితుడికి శిక్షపడేలా కృషి చేసినందుకు సీపీ దేవేంద్రసింగ్ చౌహాన్ అభినందించి రివార్డు ప్రకటించారు.